

ఎల్లమ్మ, బంగారు పోచమ్మ ఆలయ పునరుద్ధరణ నమూనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఆలయ పునరుద్ధరణ నమూనా పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్‌కాలనీలోని ఎల్లమ్మ, బంగారు పోచమ్మ మాతల ఆలయ పునరుద్ధరణ నమూనాకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కాలనీ అధ్యక్షుడు అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ తేదీ ఆదివారం ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కార్యదర్శి బాలయ్య, కోశాధికారి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో నీట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఏసీపీ కాశీరెడ్డి తదితరులు

నీట్ పరీక్ష కేంద్రం పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రంను రెవెన్యూ, పోలీస్ అధికారులు శుక్రవారం సందర్శించారు. ఈనెల 4న నీట్ పరీక్ష జరుగనున్న నేపథ్యంలో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి జడ్పీహెచ్‌ఎస్‌లోని తరగతి గదులతో పాటు అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. స్కూల్‌లో బెంచీలు, వాటర్ సదుపాయాలను పరిశీలించారు. నీట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న విజయ్‌కుమార్

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, మే 2(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన మండలంలోని బండరావిరాల జడ్పీహెచ్‌ఎస్ నలుగురు విద్యార్థులకు స్వేరోస్ నెట్వర్క్ మాజీ వైస్ చైర్మన్ కందికంటి విజయ్‌కుమార్ శుక్రవారం బ్యాగులను అందజేసి ఘనంగా సన్మానించారు. ఉన్నత విద్యను అభ్యసించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

ఘనంగా విజయదుర్గామాత ఆలయ వార్షికోత్సవం

సైదాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ మాతా మైదాన్‌లోని విజయ దుర్గామాత ఆలయ 21వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం దాకా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకుని ఆలయ పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత, ఆలయ కమిటీ ప్రతినిధులు అల్లిశ్రవణ్‌కుమార్, రవిశంకర్, యాదగిరిగౌడ్, సుదర్శన్, మధుకర్, రవీందర్‌గౌడ్, బర్ల శ్రవణ్‌కుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

కసిరెడ్డి సందీప్‌రెడ్డికి 'భారతీదాసన్' నుంచి డాక్టరేట్



కసిరెడ్డి సందీప్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కసిరెడ్డి సందీప్‌రెడ్డి తమిళనాడులోని భారతీదాసన్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందుకున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అక్కినపల్లికి చెం దిన సందీప్‌రెడ్డి ప్రస్తుతం నాగోల్‌లో నివాసముంటున్నారు. కాగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో 'ఉద్యోగ నిబద్ధత, దాని ప్రభావం, ఉద్యోగాల వేర్పాటు' అనే అంశంపై అధ్యయనం చేసినందుకు గాను భారతీదాసన్ యూనివర్సిటీ సందీప్‌రెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పట్టుదలతో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకోవడం పట్ల మల్లారెడ్డి కళాశాల యాజమాన్యం, సహచర అధ్యాపకులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు సందీప్‌రెడ్డిని అభినందించారు.

హరిహరపురం కాలనీ సంక్షేమ సంఘం కమిటీ



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హరిహరపురంకాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సందీప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, సహాయ కార్యదర్శిగా నరేష్ కుమార్, కోశాధికారిగా రఘుపతిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పృథ్వీ, సభ్యులుగా జ్యోతికుమారి, వనజాక్షి, దయాకర్‌రెడ్డి, ధర్మరాజు, మధుకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, రాములు, సుధాకర్‌చారి, వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిసి కాలనీ సమస్యలను వివరించారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన టీఎన్‌జీఓ నాయకులు



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న టీఎన్‌జీఓ ఉద్యోగ నాయకులు

ఓల్డ్‌మలక్‌పేట, మే 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామక్రిష్ణారావును శుక్రవారం సచివాలయంలో టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీఎన్‌జీఓ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరమణకాలనీలోని వైజంక్షన్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు రంగారెడ్డి తదితరులు



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



చంపాపేట చౌరస్తాలో క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

చంపాపేట, మే 2(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ జడ్పీరోడ్‌లోని శ్రీరమణకాలనీ వైజంక్షన్‌లో శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి హాజరై మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా బీజేపీ ప్రభుత్వం కులగణన చేపడుతుందని అన్నారు. కులగణనతో పాటు బీసీ సమాజం రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా ముందడుగు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజుగౌడ్, అమర్‌నాథ్‌రెడ్డి, గౌని వెంకటేష్‌గౌడ్, జీవన్‌రెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రకాంత్, శ్రీకాంత్‌గౌడ్, రవి, సత్యనారాయణయాదవ్ పాల్గొన్నారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం: కార్పొరేటర్

చంపాపేట: దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట చౌరస్తాలో శుక్రవారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌నాయుడు, యోగిరాజ్, వీరారెడ్డి, టింగ్లీకర్ రాజేష్, బానుక రమేష్, సిల్వేరు అనిల్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రవణ్ కుమార్, వేణు, గోపాల్, శైలజ, శ్రీనిధి పాల్గొన్నారు.

కులగణన ప్రకటన చరిత్రాత్మకం: కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జనాభా లెక్కలతో పాటు కులగణన చేపడతామని ప్రధాని మోదీ ప్రకటించడం చరిత్రాత్మకమని, ప్రశంసనీయమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ కొనియాడారు. శుక్రవారం మారుతీనగర్ చౌరస్తాలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్, ఉపాధ్యక్షులు తోట మహేందర్ యాదవ్, నాయకులు వజీర్‌కుమార్, అంబాల మల్లేష్‌గౌడ్, సుందర్‌నారాయణ, గట్టు మహేష్, కాట విజయాగౌడ్ పాల్గొన్నారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మూసారాంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి, దినేష్ పటేల్, నర్సింహ, వినోద్ తదితరులు

మోహన్‌నగర్‌లో..

కులగణన చేపట్టనున్నట్లు వెలువడిన ప్రకటనపై రాష్ట్ర నాయకుడు బోల్గం యశ్పాల్‌గౌడ్ బీజేపీ మోహన్‌నగర్ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయం వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రాచకొండ రాధిక, కిరణ్‌కుమార్, అజయ్‌సింగ్, సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

సైదాబాద్ : దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన విషయంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సైదాబాద్‌లో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లింగాల హరి గౌడ్, నేతలు నర్సింహ, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతుల పెండింగు బిల్లులు చెల్లించండి

- తెలంగాణ పాడి రైతుల సంఘం డిమాండ్



పెండింగుల బిల్లును చెల్లించాలని కోరుతూ మదర్‌డెయిరీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ పాడి రైతుల సంఘం రాష్ట్ర నాయకులు

హయత్‌నగర్, మే 2(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల పెండింగు బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ పాడి రైతుల సంఘం ఆధ్వర్యంలో మదర్‌డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ పాడి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మంగ నర్సింహులు, కో- ఆర్డినేటర్ పెసరగాయాల జంగారెడ్డిలు మాట్లాడుతూ మూడు నెలలుగా మదర్‌డెయిరీ పాడి రైతులకు దాదాపు రూ.64కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. 15రోజులకు ఒక్కసారి బిల్లు చెల్లిస్తామని చెప్పి సేకరిస్తున్న మదర్ డెయిరీ బిల్లులు చెల్లించకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. దీంతో రైతులకు కుటుంబ పోషణ కరువై అప్పులు చేయాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది రైతులు మదర్ డెయిరీకి పాలుపోయకుండా ఇతర ప్రైవేటు డెయిరీల వైపుకు మొగ్గు చూపి పాలుపోస్తున్నారని తెలిపారు. మదర్‌డెయిరీని నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగుతుందన్నారు. అందులో భాగంగా డెయిరీకి నష్టాలు వచ్చేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనంతటికి పాలకవర్గమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మదర్ డెయిరీని కాపాడాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇవ్వాల్సిన ఆరుబిల్లులు చెల్లించి లీటరుకు రూ.5 ప్రోత్సాహకాన్ని అందించాలన్నారు. అదేవిధంగా పాడి రైతులకు 50శాతం సబ్సిడీలపై పాడి సంరక్షణ మందులు, గడ్డి విత్తనాలు, పాల టెస్టర్లు, చాఫ్టర్లు, పాల అనలైజర్లు సరఫరా చేయాలని చైర్మన్‌ను కోరారు. పశువుల వైద్యం కోసం ప్రత్యేక మొబైల్‌లను ఏర్పాటు చేసి ఇంటి వద్దనే వైద్యం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, సోమిరెడ్డి, బాల్‌రాజ్, చంద్రారెడ్డి, నాగయ్య, మధుసూదన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

రేవంత్.. తులం బంగారం ఎక్కడా : సబితారెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్బీనగర్, మే 2(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డల పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంలో దేశంలోనే తొలిసారిగా మాజీ సీఎం కేసీఆర్ విప్లవాత్మకంగా కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలకు శ్రీకారం చుట్టారని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లకు చెందిన 99 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చే రూ.1,00,116 తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన గడిచినా నేటికీ అమలు చేయలేదని, రేవంత్‌రెడ్డి తులం బంగారం ఎక్కడా అని ఆమె ప్రశ్నించారు. 420 హామీలకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయలేదని, ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని తాము వదిలిపెట్టకుండా ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, నాయబ్ తహసీల్దార్ జంగయ్య, సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట, మే 2(ఆంధ్రజ్యోతి): చంపాపేట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ వినయ్‌నగర్ ఫీడర్‌లో శనివారం వివిధ మరమ్మతుల కారణంగా సాయంత్రం 3:30గంటల నుంచి 6:30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని క్రిష్ణానగర్, వినయ్‌నగర్, ఎన్‌ఎస్‌ఆర్‌కాలనీ, బీఎస్‌ఎన్‌ఎల్ క్వాటర్స్, శ్రీనివాస్‌నగర్, బాలాజీనగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

చంపాపేట 11కేవీ ఫీడర్‌లో..

చంపాపేట 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో వివిధ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని సాయిరాంనగర్‌కాలనీ, శిఖరాఎన్క్లేవ్, నాగార్జున కాలనీ, ఆర్టీసీకాలనీ, భానునగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

సుల్తాన్‌వాల్యా 11కేవీ ఫీడర్‌లో..

చంపాపేట విద్యుత్ సెక్షన్‌లోని సుల్తాన్‌వాల్యా 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో వివిధ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని కటికోనికుంట, చంపాపేట ఓల్డ్ విలేజ్, సాయిరాంనగర్‌కాలనీ, సుల్తాన్‌వాల్యా, బస్తీదవాఖానా, రాజిరెడ్డినగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

శ్రీనివాసానగర్ 11కేవీ ఫీడర్‌లో..

శ్రీనివాసానగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో శనివారం వివిధ మరమ్మతుల కారణంగా ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని గ్రీన్‌పార్కుకాలనీ, శ్రీనివాసానగర్ కాలనీ, సాయిరాంకాలనీ, తపోవన్‌కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

కమనీయం లక్ష్మీనారాయణుల కల్యాణం



అష్టలక్ష్మీ ఆలయ ఆవరణలో లక్ష్మీనారాయణుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఎల్‌బీనగర్, మే 2(ఆంధ్రజ్యోతి): వాసవీకాలనీలో వెలసిన అష్టలక్ష్మీ ఆలయం 29వ (ఏకోనత్రింశత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం సుప్రభాతసేవ, బాలభోగ మంగళశాసనం అనంతరం కాలసర్ప దోష నివారణ కోసం శ్రీవరాహేష్టి ఘనంగా నిర్వహించారు. చతుస్థానార్చన, సింహవాహనసేవ అనంతరం శ్రీశంకర భగవత్పాదుల జయంతి సందర్భంగా అర్చన, యాగశాలలో నిత్యపూర్ణాహుతి, ఇష్టిశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామస్తోత్ర పారాయణం, యాగశాలలో నిత్య హోమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. లక్ష్మీనారాయణులను అశ్వవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు. ఈ ఉత్సవాలలో ఆలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, వ్యవస్థాపక చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, మాలే శ్రవణ్, శ్రీధర్, రామ్‌కిషన్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకులది పేర్ల కోసం ఆరాటం : అరవింద్‌రెడ్డి



మాట్లాడుతున్న అరవింద్‌రెడ్డి, రవికుమార్

వనస్థలిపురం: బీజేపీ నాయకులది పేర్ల కోసం ఆరాటం.. అభివృద్ధికి ఆటంకమని, చిల్లర రాజకీయాలకు కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెరలేపారని బీఆర్‌ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరవింద్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఎన్జీవోస్ కాలనీలోని నూతన గ్రంథాల య భవన నిర్మాణానికి ఎంతో కష్టపడి రూ.1 కోటి95లక్షల నిధులు తీసుకవచ్చారన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లచ్చిరెడ్డి కొబ్బరికాయలు కొట్టి, ఫొటోలకు పో జులిచ్చి ఆ తర్వాత ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం సహించరానిదన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ పేరు శిలాఫలకంలో చిన్న అక్షరాలతో పెట్టారనే నెపంతో పథకం ప్రకారమే తమ అనుచరులతో కలిసి శిలాఫలకాన్ని పగలకొట్టడం డివిజన్ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఎన్నో రోజులుగా ఈ పనులకు ఆటంకాలు కలిగిస్తూ వస్తున్నారనీ, ఎట్టకేలకు పనులు ప్రారంభమైతే ఓర్వలేక మరోసారి ఆ పనులకు ఆటంకం కలిగించేటట్టు చేస్తున్న ఈ హేయమైన చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులకు కావాల్సింది ఏంటి? పేర్ల పెత్తనమా?లేక అభివృద్ధా అని ప్రశ్నించారు. గత నెలలో మంత్రి శ్రీధర్‌బాబు కొన్ని పనులను ప్రారంభించడానికి ఎల్బీనగర్‌కు వచ్చిన ఆ శిలాఫలకాలలో స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేరు కూడా కిందనే చిన్న అక్షరాలతో ఉందని అయినా తాము మంచి మనసుతో కలిసిపోయి మంచి వాతావరణంలో ప్రారంభోత్సవాలు చేయలేదా, వాటిని తాము ఎమైనా కూలగొట్టామా అని ప్రశ్నించారు. డివిజన్ పరువు బజారు పాలు చేసిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి కార్పొరేటర్ పదవికి అనర్హుడన్నారు. వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు అనిల్‌చౌదరి, నిర్మలాదేవి పాల్గొన్నారు.



మార్నింగ్‌వాక్‌లో స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్

మార్నింగ్‌వాక్‌లో జోనల్ కమిషనర్ సమస్యలపై ఆరా

ఎల్‌బీనగర్, మే 2(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ మార్నింగ్‌వాక్ చేస్తూ సమస్యలపై ఆరా తీస్తున్నారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా కాలనీలలో పర్యటిస్తూ అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. అందులో భాగంగా శుక్రవారం సరూర్‌నగర్ సర్కిల్ ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఇన్‌కంటాక్స్ కాలనీలో సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత శ్రీధర్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ సొసైటీ అధ్యక్షుడు రామారావు, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేతలు జడ్సీకి స్థానిక సమస్యలను వివరించారు. కార్యక్రమంలో శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం ధర్మకర్తలు వెంకటేశ్వర్లు, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వనస్థలిపుం డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ తదితరులు

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న గిరిధర్‌పై చర్యలు తీసుకోవాలి

వనస్థలిపురం, మే 2(ఆంధ్రజ్యోతి): పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న పోచంపల్లి గిరిధర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ వనస్థలిపుం డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఇతర పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతి శ్రీనివాస్ మాట్లాడుతూ వనస్థలిపురానికి చెందిన పోచంపల్లి గిరిధర్ పార్టీ సి ద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ తాను మాత్రం పార్టీకి చెందినట్లు ప్రచారం చేసుకుంటూ గడిచిన అన్ని ఎన్నికల్లో బీజేపీని విమర్శించాడని తెలిపారు. అదేవిధంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ మీద పోటి చేసిన సదరు వ్యక్తి పార్టీలో ఎలాంటి పదవులు ఇవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్ గౌడ్, విజయ్‌కుమార్, మధుకర్‌గౌడ్, అనిల్‌కుమార్, భిక్షపతి పాల్గొన్నారు.